## క్లుప్తంగా

### మౌలిక వసతులు కల్పించండి

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న కొత్తగూడ చౌరస్తాలోని పలు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ, సీసీ రహదారులు వంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. నిధులు కేటాయించి అభివృద్ధి చేసేలా కృషి చేయాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షితరెడ్డి, నాయకుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తుడు రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

**ముక్కుపుడక బహూకరణ**

రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మకు అదే గ్రామానికి చెందిన కోటగళ్ల రాజ్‌కుమార్ దంపతులు బంగారు ముక్కుపుడక, కిరీటం, పట్టు వస్త్రాలు సమర్పించుకున్నాడు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమం మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది. మంగళవారం 23వ రోజు ఈ కార్యక్రమాన్ని పుర కేంద్రంలోని 14వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధులు, రోడ్లను శుభ్రం చేశారు. డ్రైనేజీ, నాలాలు క్లీన్ చేశారు. పరిసరాల–పరిశుభ్రతపై ప్రజలకు పుర అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణి, ఆర్‌ఐ మల్లేశ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మాజీ ఎంపీపీ సునీత



తండావాసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మహేశ్వరం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని మాజీ ఎంపీపీ రాత్లావత్ సునీతా అంధ్యానాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేసీ తండాలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో అపోలో మాధవన్‌జీ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తండావాసులకు కంటి పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతినాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంధ్యానాయక్, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, అవేర్ సంస్థ కార్య నిర్వాహణాధికారి వెంకన్న, గ్రామ పెద్దలు రవీందర్‌నాయక్, గోపాల్‌నాయక్, మున్యానాయక్, లాలూనాయక్, సూర్యనాయక్, రమేశ్‌నాయక్, రెడ్యానాయక్, రాజు, శశికాంత్, గోపిసింగ్, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

కందుకూరు: కందుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కొత్తగూడ ఫీడర్‌తో పాటు నక్కలబావి ఫీడర్లకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలో లైన్ల కింద చెట్లకొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# సగం వరకే నిర్మాణాలు

- ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మిశ్రమ స్పందన
- గడువు విధించడంతో ఒత్తిడిలో లబ్ధిదారులు



జైత్వారంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కందుకూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించడానికి ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ గడువు విధించడంతో అటు అధికారులు, ఇటు లబ్ధిదారులకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటివరకు మంజూరైన ఇళ్లల్లో సగం వరకే నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడంతో ఆయా ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మిగతా వారు నిర్మాణాలు చేపట్టేలా అధికారులు ఒత్తిడి తెస్తున్నా ఆర్థిక వనరులు అందుబాటులో లేకపోవడం, మరోపక్క మంచి రోజులు లేకపోవడంతో పాటు ఇతరత్రా సమస్య కారణంగా చాలా మంది ఆసక్తి చూపడం లేదు.

**1,222 ఇళ్లు మంజూరు**

మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీల్లో 1,222 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 621 ఇళ్లకు అధికారులు మార్కింగ్ ఇచ్చారు. 448 మంది మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించగా, అందులో 80 ఇళ్ల వరకు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయి. అందులో అగర్‌మియాగూడలో 11 ఇళ్లకు గాను 4 మాత్రమే ప్రారంభమయ్యాయి. ఆకులమైలారంలో 52 ఇళ్లు మంజూరు కాగా 18, అన్నోజిగూడలో 23 ఇళ్లకు గాను 5, బాచుపల్లిలో 34 ఇళ్లకు గాను 5, బైరాగిగూడలో 13 ఇళ్లకు గాను 3, బేగరికంచెలో 16 ఇళ్లకు గాను 3, బేగంపేటలో 42 ఇళ్లకు గాను 24, చిప్పలపల్లిలో 36 ఇళ్లకు గాను 16, దెబ్బడగూడలో 61 ఇళ్లకు గాను 18, దాసర్లపల్లిలో 28 ఇళ్లకు గాను 18, దాసర్లపల్లితండాలో 12 ఇళ్లకు గాను 7, దావూద్‌గూడతండాలో 6, ధన్నారంలో 15, గూడూరులో 10, గుమ్మడవెల్లిలో 18, జబ్బార్‌గూడలో 6, జైత్వారంలో 14, కందుకూరులో 8, కటికపల్లిలో 2, కొలన్‌గూడలో 10, కొత్తగూడలో 13, కొత్తూర్‌లో 17, లేమూరులో 33, మాదాపూర్‌లో 5, మీర్‌ఖాన్‌పేటలో 25, ముచ్చర్లలో 6, మురళీనగర్‌లో 14, నేదునూరులో 51, పెద్దమ్మతండాలో 6, పులిమామిడిలో 7, రాచులూరులో 9, సాయిరెడ్డిగూడలో 8, సరస్వతిగూడలో 7, సార్లరావులపల్లిలో 10, తిమ్మాపూర్‌లో 27 మంది మాత్రమే ప్రారంభించారు.

#### మంచి రోజులు లేక

చాలా మంది గ్రామాల్లో మంచి ముహుర్తాలు చూసుకునే ఇంటి నిర్మాణాలు ప్రారంభిస్తారు. కాగా ప్రస్తుతం మంచి రోజులు లేకపోవడంతో పాటు పలుచోట్ల వారి ఇళ్లల్లో ఎవరైనా మరణించినా, గర్భిణులుగా ఉన్నా ఇంటి నిర్మాణాలను చేపట్టలేరు. దీంతో పాటు ఆర్థికంగా వనరులు అందుబాటులో లేక చాలా మంది నిర్మాణాలు చేపట్టలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ నెల 25న డెడ్‌లైన్‌గా విధించడంతో అధికారులు గ్రామాల్లో ముమ్మరంగా పర్యటించి ఇంటి నిర్మాణాలను ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన తర్వాతే బిల్లులను విడతల వారీగా మంజూరు చేయనుండటంతో ప్రస్తుతం వారి వద్ద నగదు లేక కూడా ఇల్లు ప్రారంభించలేకపోతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక రవాణాకు అవకాశం కల్పించినా మండల పరిధిలో నదులు, వాగుల వంటివి లేవు. దీంతో వారు మార్కెట్ ధర ప్రకారం ఇసుక కొనుగోలు చేయాల్సిందే.

#### నిధుల కొరతే..



చాలా మందికి నిధుల కొరతతో ఇల్లు ప్రారంభించలేకపోవడాన్ని గుర్తించాం. అటువంటివారు మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉంటే రుణాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం. సభ్యులుగా లేని వారికి సంబంధిత బ్యాంకులతో మాట్లాడుతున్నాం. చాలామంది మంచిరోజులు లేవని నిర్మాణాలు వాయిదా వేసుకుంటున్నారు. త్వరగా ప్రారంభించేలా కృషి చేస్తున్నాం. 25 వరకు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

– సరిత, ఎంపీడీఓ, కందుకూరు

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే సబితారెడ్డి



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన కుమ్మరి జంగయ్యకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.33వేల చెక్కును మంగళవారం కార్యాలయంలో ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో రాజకీయాలకతీతంగా ఉన్నామన్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దువ్వాసి నర్సింహ, మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండాల సురేష్, నాయకులు నరేశ్, రాజు, ప్రతాప్‌రెడ్డి, రాములు, లక్ష్మయ్య, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## సబితారెడ్డిపై విమర్శలు సరికాదు

బీఆర్‌ఎస్ నేత రాఘవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

మహేశ్వరం: ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రోద్బలంతో రాజకీయంగా ఎదిగిన నేతలు ఆమెపైనే విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకుడు మర్యాద రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇటీవల కాంగ్రెస్ నుంచి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరారన్నారు. ఈ విషయం కొంత మందికి జీర్ణించుకోవడం లేదన్నారు. పార్టీకి వస్తున్న ఆదరణ చేసి ఓర్వలేక ఎమ్మెల్యే సబితారెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆమె మద్దతుతో ఎదిగిన నాయకులు సైతం మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జాన్‌రెడ్డి, రాజునాయక్, ఆంజనేయులుగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, శంకరయ్య, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌చారి, అశోక్‌గౌడ్, కుమార్‌గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక

మహేశ్వరం: ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగల ప్రయోజనాలకే పరిమితం కాకుండా అన్ని అణగారిన ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని దుబ్బచర్లలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందన్నారు. జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతీ గ్రామంలో ఘనంగా నిర్వహించాలని కోరారు.

**ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం**

దుబ్బచర్ల ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎర్ర శ్రీధర్ మాదిగ, ఉపాధ్యాక్షులుగా నడ్డి అరవింద్ మాదిగ, ఎర్ర రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పొట్టగళ్ల జయరాజ్ మాదిగ, కార్యదర్శిగా నర్సింహ మాదిగ, సహాయ కార్యదర్శిగా నడ్డి నరేశ్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా జుట్టు రమేశ్ మాదిగ, కోశాధికారిగా అంబేడ్కర్ మాదిగ, సలహాదారులుగా ఎర్ర జగన్ మాదిగ, పొట్టగళ్ల శేఖర్ మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఎస్‌ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) అధ్యక్షుడిగా నడ్డి సాయికుమార్ మాదిగ, మాదిగ యువసేన కమిటీ అధ్యక్షుడిగా నడ్డి శ్యామ్యూల్ రాజ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కని రవిమాదిగ, నాయకులు కృష్ణ మాదిగ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## అఘాయిత్యాల అడ్డుకట్టలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో పాల్గొన్న షైమీద

నాగోలు: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యాయని భారత జాతీయ మహిళ సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షైమీద అన్నారు. కమలమ్మ అధ్యక్షతన న్యూ నాగోలులోని ఎస్‌ఏ డాంగే భవన్‌లో మంగళవారం నిర్వహించిన సరూర్‌నగర్ మండల 16వ మహాసభలో షైమీద పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగస్తులు కూలి, ఇళ్లలో పని చేసే మహిళలు యజమానుల ఒత్తిడికి గురవుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని పనికి వెళ్లిన దగ్గర మహిళలకు వేధింపులు ఏమాత్రం తగ్గడం లేదని ఆరోపించారు. ఇటీవల మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాతరాజు నరసింహ, కందుల సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం సమాఖ్య సరూర్‌నగర్ మండల అధ్యక్షురాలిగా సుమలత, ప్రధాన కార్యదర్శిగా కమలమ్మతో పాటు 11 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

### బీసీ హక్కుల సాధనే ధ్యేయం

మహేశ్వరం: బీసీల హక్కుల సాధన కోసం మన ఆలోచనల సాధన సమితి (మాస్) పని చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. మహేశ్వరం గ్రామానికి చెందిన కాసంశెట్టి కృష్ణను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా బీసీల చైతన్యమే లక్ష్యంగా మాస్ పని చేస్తుందని స్పష్టం చేశారు. నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా 37 నియోజకవర్గాల్లో మొదటి విడత గ్రామబాట కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యవర్గాన్ని అభినందించారు. కాసంశెట్టి కృష్ణ మాట్లాడుతూ.. బీసీలను చైతన్యం చేసి హక్కుల సాధన కోసం పని చేస్తామన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్టబెట్టిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో పలువురి చేరిక



జాపాలలో పార్టీలో చేరిన నాయకులు

మంచాల: మండలంలోని జాపాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగమయ్యగౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆకర్శితులై పార్టీలో చేరామని చెప్పారు. వారిలో నోముల ప్రవీణ్, మంతని నగేష్‌యాదవ్, మంతని నరేష్ యాదవ్ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్, నాయకులు మహేష్‌గౌడ్, శేఖర్, రవి, లింగం, పరమేష్‌యాదవ్, సుమన్ పాల్గొన్నారు.

## యాదయ్య సేవలు చిరస్మరణీయం



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్: గ్రామ సర్పంచ్‌గా ఈర్లపల్లి యాదయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో ఈర్లపల్లి యాదయ్య ప్రథమ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన విగ్రహావిష్కరణతో పాటు, సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతం, ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఈర్లపల్లి యాదయ్య క్రమశిక్షణ గల కాంగ్రెస్ నాయకుడిగా పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బీక్యానాయక్, జగన్, నర్సింహ, బీచ్యానాయక్, రామకృష్ణ, అశోక్, మధు, నరేందర్ తదితరులు ఉన్నారు.

## చింతలకుంట ఫ్లైఓవర్‌ను ఎలివేటెడ్ ఫ్లైఓవర్‌గా మార్చాలి



రహదారుల చీఫ్ ఇంజినీర్‌తో చర్చిస్తున్న బీజేపీ నేతలు

ఎల్‌బీనగర్: చింతలకుంట నుంచి ఆటోనగర్ వరకు నిర్మించే ఫ్లైఓవర్ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్‌గా మార్చాలని రాష్ట్ర రోడ్డు రహదారుల ఇంజినీర్ ఇన్ చీఫ్ కృష్ణప్రసాద్‌ను కలిసి చర్చించామని బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలకుంట నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లై ఓవర్లు మట్టితో కాకుండా ఎలివేటెడ్‌గా నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారిని కలిసి విన్నివించామన్నారు. పలుమార్లు చర్చల అనంతరం హయత్‌నగర్ ఫ్లై ఓవర్ ఎలివేటెడ్‌గా, చింతలకుంట ఫ్లై ఓవర్ మట్టి ఫ్లైఓవర్లుగా అనుమతులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, నూతి శ్రీనివాసరావు, స్థానికులు పోచబోయిన కృష్ణయాదవ్, బొమ్మిడి రాంగారెడ్డి పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైనేజీ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్

నాగోలు: కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా బాక్స్ డ్రైనేజీ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. మంగళవారం ఆయన కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి సమతాపురికాలనీ, రాఘవేంద్రకాలనీల్లో పర్యటించారు. సమతపురి కాలనీ నాగోలు ఇన్నర్ రింగ్ రోడ్ నుంచి న్యూ నాగోల్ రోడ్ నెంబర్–10 వరకు చేపడుతున్న బాక్స్ డ్రైనేజీ లైన్ పనులు ఆయన పరిశీలించారు. సమతపురి కాలనీ లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నారని, సమతపూరి కాలనీ రోడ్ నెంబర్ 2,3,4 లో నూతన పైప్ లైన్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కోరగా నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత, ఈఈ శ్రీనివాస్, డీఈ చందన, ఏఈ షరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, కాలనీవాసులు శ్రీనాథ్, నాయకులు మంచి రాజేష్, సుందర్ నారాయణ, వెంకట్ రెడ్డి, విజయ గౌడ్ , లావణ్య, పింకీ సింగ్ పాల్గొన్నారు.

## చౌరవ ఎవరిదైనా సమస్య పరిష్కారం

వనస్థలిపురం: వనస్థలిపురం కమలానగర్, ఆంధ్రకేసరినగర్ కాలనీలలో రిజిస్ట్రేషన్ల సమస్య రాజకీయ రంగు పులుముకుంది. ఈ కాలనీలలో దాదాపు 30, 40 సంవత్సరాలుగా ఇళ్లు కట్టుకుని ఉంటున్నారు. ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు సాహెబ్‌నగర్ కలాన్ సర్వే నెం. 2 నుంచి 8 వరకు ఉన్న భూములు తమవి అంటూ కోర్టును ఆశ్రయించడంతో ఆ కాలనీలలో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఇబ్రహీంపట్నం ఆర్డీవో స్టేటస్ కో విధించారు. ఈ క్రమంలో ఆందోళన చెందిన కాలనీల ప్రజలు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌లకు సమస్య పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేయగా ఈ క్రమంలో ఆర్డీవోతో మాట్లాడి స్టేటస్ కో ఎత్తివేయించామని రెండు రోజుల క్రితం మధుయాష్కీగౌడ్ పత్రికా ప్రకటన చేయగా ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి చేశారని కొందరు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో కాలనీల నాయకులు సోమవారం మధుయాష్కీగౌడ్, మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న టిప్పు సుల్తాన్

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి తలకొండపల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్ రూ.51 వేలు విరాళం అందించారు. గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు ఇటీవల ఆయన్ని కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీనికి స్పందించి రూ.51వేల చెక్కును మంగళవారం వెంకటేశ్ మిత్రమండలి అధ్యక్షుడు షేక్ టిప్పు సుల్తాన్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, వెంకటయ్య, యాదయ్య, జంగయ్య, వెంకటేశ్, ప్రవీణ్, రాజు, జంగయ్య, నర్సింహ, మహేశ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు సన్మానం



విద్యార్థికి ప్రశంసాపత్రం ఇస్తున్న అధికారులు

మంచాల: నిరుపేద కుటుంబంలో పుట్టి పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న డాక్టర్ ఎస్.కె.భిక్షపతిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీఓ బాలశంకర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 25 మంది విద్యార్థులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. తాళ్లపల్లిగూడకు చెందిన భిక్షపతి పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులను శాలువాతో సన్మానించి క్యాలిక్యులేటర్, నోట్ బుక్స్, ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికను అందజేశారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన చెన్నారెడ్డిగూడ, మంచాల బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో భిక్షపతి, ఎంఈఓ రాందాస్, ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ హౌస్!

- పూర్తికాని ఇందిరమ్మ నమూనా ఇల్లు
- 5 నెలలు గడిచినా ముందుకు కదలని వైనం



ఇబ్రహీంపట్నంలో అసంపూర్తిగా ఇందిరమ్మ మోడల్ హౌస్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదిలోనే ఆరోపణలు ఎదురవుతున్నాయి. నియోజకవర్గానికి ఓ నమూనా ఇంటిని నిర్మిస్తామన్న సర్కారు నిర్ణయం నీటి మీద రాతలు మారింది. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న ఖాళీ స్థలంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి గత జనవరి 17న స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి భూమి పూజ చేశారు. 45 రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. నేటికి ఐదు దాటినా పనులు పూర్తికాకపోవడం శోచనీయం. అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగా పనులు నత్తతో పోటీ పడుతున్నాయి.

**3,500 ఇళ్లు మంజూరు**

నియోజకవర్గంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలం ఉన్న అర్హులకు తొలివిడత కింద 3,500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పథకం కింద రూ.5 లక్షలు నాలుగు విడతలుగా విడుదల చేయనున్నారు. మంజూరు పత్రాలను ఇటీవల లబ్ధిదారులకు ఎమ్మెల్యే రంగారెడ్డి అందజేశారు. ఈ ఇందిరమ్మ నమూనా ఇంటిని చూసి లబ్ధిదారులు తమ ఇల్లును నిర్మించుకోవాల్సి ఉంటుంది. 400 ఎస్ఎఫ్‌టీ కంటే తక్కువ 600 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ కొలతలతో ఇంటి నిర్మాణం చేసినట్లేయితే నిధులు విడుదల కావని అధికారులు తెగేసి చెబుతున్నారు. కానీ మోడల్ హౌస్ నిర్మాణం పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు అటువైపు రావడంలేదు.

**నిధుల వృథా!**

పేదలకు ఇళ్లు మంజూరై ఇంటి నిర్మాణాలు మొదలైనా.. ఇంతవరకు ఇందిరమ్మ మోడల్ హౌస్ పూర్తి కాలేదు. అలాంటప్పుడు ఈ నిర్మాణం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిర్ణీత గడువులో నిర్మించకుండా, లబ్ధిదారులకు సైతం ఉపయోగపడనప్పుడు నిధులు వృథా కావడమే అవుతుందని స్థానికులు భావిస్తున్నారు.

#### త్వరలో పూర్తి చేస్తాం

స్లాబ్, గోడల వరకు నిర్మాణం పూర్తి అయింది. ప్లాస్టింగ్ వర్క్ నడుస్తుంది. వారం పది రోజుల్లో మోడల్ హౌస్ నిర్మాణం పూర్తి అవుతుంది. మేస్త్రీ, లేబర్ అందుబాటులో లేకపోవడం జాప్యానికి కొంత కారణం. ఇప్పటివరకు రూ.3 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

– రాంచంద్రయ్య, హౌసింగ్ ఏఈ, ఇబ్రహీంపట్నం

#### లబ్ధిదారులకు శాపం

45 రోజుల్లో నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించి ఇప్పటివరకు మోడల్ హౌస్ అందుబాటులోకి రాకపోవడం లబ్ధిదారులకు శాపం. అధికారులు ఇళ్ల నిర్మాణానికి పలు ఆంక్షలు పెట్టారు. నమూనా ఇంటిని లబ్ధిదారులు చూస్తే, వారి నిర్మాణం సులువవుతుంది.

– భరత్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు